




## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

**నాన్నని వుంచగలిగినంత** కంఫర్ట్‌గా వుంచింది అమ్మ. తలకింద దిండ్లూ, మెత్తని దుప్పటి గుండెల మీదా, తెల్లని బెడ్ షీట్, ఎంతో ప్రశాంతంగా వుంది. కానీ ఆయన గుండెల్లో చెలరేగిన అలజడి మాటేవిటీ? బేండేజ్ వేసిన ఆయన చెస్ట్ వైపు చూడలేకపోయాను. పిల్లలు చేసే చాలా గాయాలకు ఇలా మందుపూసి బేండేజ్ వెయ్యలేరు.

నాన్న నా 'సారీ'కి ప్రతిస్పందించలేదు.

అంటే క్షమించలేదని అర్ధమా?

కష్టపడ్తూ మాట్లాడారు "నీ పెన్సిల్ నేనే చెక్కి ఇచ్చేవాడిని. నీ అన్నం ముద్దకూడా నేనే ఊది పెట్టేవాడిని. నువ్వు స్కూటీ నేర్చుకుంటుంటే, వెనకాల కూర్చుని నేను హేండిల్‌ని బేలన్స్ చేసేవాడిని... ఎందుకు?"

నేను మాట్లాడలేదు.

"నీకు హాని కలగకూడదని. అమ్మ ఎందుకు తిడ్తుంది నిన్ను? భయం. ఎక్కడ నీకు అపాయం కలుగుతుందోనని ఇవన్నీ నీకు అర్థం కావాలంటే" ఆయాసంతో ఆగారు.

నేను భయంగా ఆయన మీద చెయ్యి వేసాను.

"నీకూ పిల్లలు పుట్టాలి" అన్నారు.

నేను చెయ్యి తీసేసాను. ఇది శాపమా? దీవెనా? ప్రతి తల్లితండ్రులూ పిల్లల్ని ఒక్కసారన్నా ఇలా అంటారేమో.

"ఒకసారి అతన్నిపిలు లేదా అతని నెంబర్ నాకివ్వు" అన్నారు.

నాకే రెండురోజులుగా అతీగతీలేదు. ఫోన్‌కి అందుబాటులో లేదు అంటే ఆయన గుండెకి మరో స్టంట్ పడుతుందేమో.

"ఇప్పుడు ఆ టాపిక్ ఎందుకులే నాన్నా పడుకోండి" దుప్పటి గొంతుదాకా పైకి సుతారంగా కప్పి లేచాను.

"మీ అమ్మ ఉత్త పిచ్చిది. లోకం తెలీదు. హనీష్ మగపిల్లాడు. వాడికి అంతగా పట్టదు. నువ్వే చూసుకోవాలి" అన్నారు.

ఆయన అప్పగింతలు మొదలు పెట్టారు. చిన్నగా నవ్వాను. అప్పగింతలు పెడ్తున్నారంటే నన్ను క్షమించినట్లే అనుకున్నాను.

అసలు ఈ లోకంలో మనని ఇంత సులభంగా క్షమించగలిగేది ఏం చేసినా తల్లితండ్రులుగాక మరెవరు?

తెల్లవారింది. ధీరజ్ చెప్పింది ఎంత నిజం? ఎన్ని ఘాతుకాలు జరిగినా, ఉపద్రవాలొచ్చినా మరునాడు మాములుగానే తెల్లవారుతుంది. సూర్యుడు తూర్పునే ఉదయిస్తాడు.

"నీవల్ల మా నాన్నకి హార్ట్ ఎటాక్ వచ్చింది. మా అమ్మ నాతో మాట్లాడటంలేదు. నేను తల్లిని కాబోతున్నానో లేదో తెలియదు. జీవితం అస్తవ్యస్తం అయింది. ఆకలి వెయ్యడంలేదు. నిద్ర రావట్లేదు. ఒక్క రోజుకే మొహం పీక్కుపోయింది. కళ్ళక్రింద నల్లవలయాలు ఏర్పడ్డాయి. నీ ఫోన్ రాక నువ్వు నాకు వున్నావో లేవో తెలీక అస్తమానం దానికేసి చూసి చూసి పిచ్చెక్కేట్లుంది. కానీ నువ్వో ఏ లేపాక్షిలాంటి అమ్మాయితోటో ఫ్లర్టింగ్ చేస్తూ ఏ కాసినోవాలోనో, చేతిలో వైన్ గ్లాస్‌తో పందాలు కాస్తూ.... జూదం ఆడుతూ హాయిగా వుండివుంటావు. హౌ ఇన్ హ్యూమన్ యూ ఆర్?" ఇంకా చాలా టైప్ చేసాను. "నువ్వంటే నాకు అసహ్యంగావుంది" అని కూడా.. మళ్ళీ అన్నీ డిలీట్ చేసాను.

"యూ లుక్ హారిబుల్" అంది యాషికా.

"ఐ నో" అన్నాను.

"లేచి తల దువ్వుకో. కొంచెం మామూలుగా కనిపించు లోకానికి. దేవదాసు సిస్టర్‌లా అక్కర్లేదు" అంది.

వంటగదిలో ప్రియంవద పెద్దమ్మా, అమ్మా రవ్వలడ్లూ, మినపసున్నీ చేస్తున్నారు. నేను మంచి నీళ్ళకోసం వెళ్ళేసరికి అమ్మా నాతో కాకుండా, పెద్దమ్మకి చెప్తున్నట్లు "ఆయన్ని చూడడానికి వాళ్ళ ఆఫీసు వాళ్ళూ, బంధువులూ వస్తున్నారు. ఇంట్లో వాళ్ళకి పెట్టడానికి ఏమైనా వుండాలిగా" అంటోంది.

నీళ్ళు తాగుతున్న నాకు నవ్వుతో పొలమారింది. నేను ఎంత బాధలో వున్నా వసుంధర ఫూలిష్‌నెస్ నన్ను నవ్విస్తుంది.

"పెళ్ళి చూపులకీ పరామర్శకీ కూడా నీకు తేడా తెలీదమ్మా" అన్నాను.

వసుంధర తల వంచుకుని "అక్కా.. ఇన్ని నీళ్ళు చాలా? చేగోడీలకీ?" అని పెద్దమ్మతో మాట్లాడ్తోంది. నాతో తను ఇంకా మాట్లాడడంలేదు.

తన భర్తని చంపబోయిన శత్రువుని చూసినట్లే చూస్తోంది. కానీ పెద్దమ్మకి మాత్రం నా గురించి ఏమీ తెలియకూడదు అనుకుంటోంది.

పెద్దమ్మ చెప్తోంది "మాతోడికోడలు తమ్ముడి కొడుకువున్నాడు. మంచి సంబంధం, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్" అని.

"పేరేవిటీ?" అమ్మ అడిగింది.

"సోమేశ్వరరావ్"

"హూ! అది ఒప్పుకోదు. మీ ఆయన పేరు పుల్లయ్య అని, నీకేదో ద్రోహం జరిగినట్లు ఇప్పటికీ బాధ పడ్తూనే వుంటుంది" అంది అమ్మ.

"పేరు ఏం చేసింది? నాకేం తక్కువ చేసారు మీ బావ? రాజమండ్రిలో, అమలాపురంలోకూడా కొబ్బరి తోటలు కొని నా పేరిటే పెట్టారు మీ బావ. ఏటా ఇళ్ళ అద్దెలమీదొచ్చే డబ్బులతో నన్నే బంగారం కొనుక్కోమంటారు. చూసిన నగా, చూసిన చీరా, ఇంతకన్నా ఏం కావాలి ఆడదాని జీవితానికీ?" అంది పెద్దమ్మ.

"పోపూ, కరివేపాకూ, రవ్వా, నీళ్ళూ..అంతే. సింపుల్" అని ఉప్మా చేసినంత తేలిగ్గా ఆడదానికి జీవితంలో ఏం కావాలో చెప్పేసింది పెద్దమ్మ.

వెనక్కి తిరిగి వస్తుంటే "మనం జీవితం కాచి వడబోసి చెప్పే జీవన సత్యాలు దానికి జోక్స్‌లా వుంటాయి. పేరు బావుంటే బీచ్ దగ్గర ఆడుక్కునే వాడైనా ఫర్లేదు ఈ కాలం వాళ్ళకి. అన్ని అర్హతలూ  వున్నా పాపం అతని పేరు పాతకాలందిలాగా వుంటే ఆట పట్టిస్తారు" అంది అమ్మ.

అమాంతం వెనక్కి తిరిగి "సరే! ఆ సోమేశ్వరరావుతో ముహూర్తం పెట్టించండి" అనేసి చూద్దాం అనిపించింది.

అసలు అలాగే చెయ్యాలి ఈ ద్వారకకి.

బామ్మ గోరు చిక్కుడుకాయలు వలుస్తోంది. ఇరుకిరుగ్గా రామకోటి రాసినట్లే, చిన్న చిన్నగా గోరు చిక్కుళ్ళు కట్ చేస్తుంటుంది. అను నిత్యం మనసులో జపం చేస్తుంటుంది. భర్తలేదు కాబట్టి, పుట్టిన పిల్లలిద్దరూ బావుండాలని ఆ దేవుడ్ని వేధిస్తూ  రాత్రింబగళ్ళు నిద్రపోనివ్వదు. ఇంకో ఇరవై ఏళ్ళ తర్వాత, భర్త ఆరోగ్యం కోసం ఉపవాసాలు చేస్తూ నేనూ వసుంధరలా, మరో నలభై ఏళ్ళు పోయాక నేనూ జపం చేస్తూ బామ్మలా.. ఇలా ఏదో ఒక రోజున రాలిపోతాం. జీవితం అంటే.. ఇంతేనా?

యాషిక వెళ్ళిపోతోంది "ఇప్పటికీ రిప్లై రాలేదు కదూ" అంది.

"అతనికి ఏదైనా ప్రమాదం జరిగిందేమో అని భయంగా వుంది" అన్నాను.

"అది నీ విష్‌ఫుల్ థింకింగ్" అంది.

"వాట్?" అదిరిపడ్డాను.

"అతను నీ ఘాటు మెసేజ్‌లకి కూడా రిప్లైలు ఇవ్వకపోవడం వలన ఏదైనా అంత పెద్ద కారణంతోటే అతను నాకు రెస్పాండ్ అవ్వట్లేదు అని నీ ఈగోని చల్లబరుచుకుంటున్నావేమో? అలాంటిదే జరిగితే వాళ్ళమ్మ నీకు తెలియబరిచేదేగా" అంది.

గతుక్కుమన్నాను. నిజంగా నేనంత ఈగోయిస్ట్‌నా? లేక శాడిస్ట్‌నా? అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను.

యాషిక వెళ్ళిపోయాక, ఒక్కదాన్నే ఇంటికి రాబుద్ధికాక సినిమాకి వెళ్ళాను.

అదొక మాల్. ఆడవాళ్ళు జనరల్‌గా చెయ్యని పనులు.. ఒక్కళ్ళే సినిమాకి వెళ్ళడం, ఒక్కళ్ళే హోటల్‌కి వెళ్ళడం. ఇవి చెయ్యడానికి 80% మంది గిల్టీగా ఫీల్ అవడమో, భయపడడమో చేస్తారు .చెప్పే కారణం మాత్రం మాకు అలవాటులేదని. పెళ్ళయ్యాక ప్రతిరాత్రీ భర్తతో... అలవాటుండబట్టే చేస్తారా? కొన్ని కొన్ని కన్వీనియెంట్‌గా మనసుకి అబద్ధాలు చెప్పుకుంటారు అలా.

చుట్టూ ఫుడ్ కోర్టులో జనం గోలగోలగా మాటలు చెప్పుకుంటూ, ఫెళ్ళున నవ్వులు నవ్వుకుంటూ తింటున్నారు. పిల్లలు ఏదో కొనమని ఏడుపులూ, పెద్దవాళ్ళ గద్దింపులూ. పక్క టేబుల్ దగ్గర కూడా ఒక పాప ఏడుస్తోంది. ఏం చేతికిచ్చినా పడేస్తోంది. నేను అటు చూసేసరికి వాళ్ళ అమ్మ సిగ్గుపడ్తున్నట్లు నవ్వి "చూడు ఆ అక్క పోలీస్. ఇలా చేస్తే జైల్లో పెడ్తుంది" అని పాపని బెదిరించింది.

'నేను పోలీస్‌లా ఉన్నానా?' నావైపు చూసుకున్నాను.

"ఎందుకు ఏడుస్తున్నావ్?" పాపతో అన్నాను.

"మమ్మీ కొనను అంది."

"ఏం కావాలి నీకు?" అడిగాను.

"మాల్ ముందు పెట్టిన ఆ జైంట్‌వీల్ కావాలట కొనమంటోంది" అంది వాళ్ళమ్మ.

నేను నవ్వాను.

బహుశా నన్నూ, నా ఆలోచనలనీ, నా కోరికలనీ చూస్తే మా అమ్మా నాన్నలూ ఇలాగే నచ్చచెప్పలేక బాధపడుతున్నారేమో కదా! సరే అనలేకా, అర్ధం అయ్యేట్లు చెప్పలేకా?

లోపల సినిమా మొదలయ్యాక, కాసేపటికే ఇంత దుర్భరమైన సినిమా మరొకటిలేదు అనిపించింది. అదో రొమేంటిక్ చిత్రం. హీరోయిన్‌ని పాటలు పాడ్తూ, వెంటపడి వేధించి "మీ అమ్మ నిన్ను నా కోసమే కన్నదీలాంటి బ్లాక్ మెయిలింగ్‌లు అన్నీ చేసి లైన్‌లో పెట్టాక, ఇద్దరూ ఓ వర్షం పడ్తున్న రాత్రి, అతని రూములో శారీరకంగా ఒకటైపోయారు. అద్భుతమైన రొమేంటిక్ సాంగ్. గదిలో ఫైర్ ప్లేస్, నీలంరంగు బల్బు వెలుగుల సాక్షిగా. ఇన్నేళ్ళయినా, ఇలాంటి సంఘటనలు జరగాలంటే, వర్షం తప్పకుండా పడాలీ, సినిమాలో వర్షం పడితే మిర్చి తిన్నంత నార్మల్ గా రొమాన్స్ చేయాలి అని చూపిస్తున్నాడా దర్శకుడు. ఇలా అయితే వర్షాకాలం అంతా ఎలా? ఏ అమ్మయీ, అబ్బాయీ ఒంటరిగా వున్నా, వర్షం పడితే కష్టంకదూ. ఇక్కడదాకా 1970లు గుర్తు చేసాక దర్శకుడు మిగతాది చాలా ఆధునికంగా తీసాడు. ఆ హీరోయిన్, తండ్రి స్టేటస్‌కి తగిన జె.బి అనే మల్టీనేషనల్ కంపెనీ ఓనర్ కొడుకుని పెళ్ళి చేసుకుంటుంది. ఇది తెలిసి,

మాసిన గెడ్డంతో వచ్చిన హీరోని "అది జస్ట్ ఒక ఇన్సిడెంట్ నా దృష్టిలో. పెద్ద ఇంపార్టెన్స్ ఇవ్వకు. కమ్. పార్టీలో జాయిన్ అవు. సంతోషంగా వుండు ఇంకో అమ్మాయిని చూసుకుని పెళ్ళి చేసుకో" అంటుంది.

ఆ అమ్మాయిని వేంప్ కేరెక్టర్‌లా, విలన్‌లా చూపించారు మిగతా సినిమా అంతా. నాకు చాలా ఫూలిష్‌గా అనిపించి లేచి వచ్చేసాను.

బట్.. ఆ అమ్మాయి ఏం తప్పు చెప్పిందీ? తనలాగే ఫీల్ అయిందేమో? నేనూ రేపు సోమేశ్వరరావుని పెళ్ళిచేసుకుంటే ఇలాగే లోకం వేంప్ అంటుందా? చాలా నవ్వొచ్చింది. చిత్రంగా బుగ్గలమీదనుండి మాత్రం కన్నీరు జారిపడింది. నేనూ ఆడపిల్లనే. ఏం  మారలేదు అనిపించింది. వైన్ షాప్ ముందునుండి వచ్చేస్తుంటే దీనికి మాత్రం పక్కన నైనానో, యాషికానో తోడుకావాలి కదా! ఇంకా నాలో స్వచ్ఛమైన భారతీయత పోలేదు.

ద్వారక్ మీద ద్వేషంతో, మొహం తెలీని సోమేశ్వరరావుతో వైవాహిక జీవితం ఊహించుకున్నాను. ఆదివారంపూట బామ్మ తాగించే ఆముదం రుచి గుర్తొచ్చింది.

ఎదురు చూసే ఓపిక లేక ఫోన్ సైలెంట్‌లో పెట్టి పడుకున్నాను.

ప్రియంవద పెద్దమ్మ ఆరోజు వెళ్ళిపోతోంది వెళ్ళేముందు నాతో సోమేశ్వరరావులాంటి అబ్బాయి అంత పెద్ద ఉద్యోగంలో వున్నవాడు దొరకడం నా భాగ్యం అనీ, తన కూతురులా నేనేమీ ఇంజనీరింగ్ కూడా చదవలేదనీ, నా బోడి ఆర్ట్స్ బి.ఏకి ఏ ఉద్యోగమూ రాదనీ, ఈ వయసుపోయాక చర్మంలో నునుపు తగ్గి ముదురుతనం వచ్చాక ఏ రెండో పెళ్ళివాడినో చేసుకోవలసి వస్తుంది అని జ్ఞానం పంచింది.

అవన్నీ నిజాలే అయి వుండచ్చుగాక, డబ్బూ, సంపాదనా, ఉద్యోగం ఇవే చూసుకుంటామా పెళ్ళి అంటే? అతనితో కలిసి మిగతా దిక్కుమాలిన జీవితం ఇంకో నలభై ఏళ్ళు బతకాలి అంటే కొంచెం తెలియొద్దూ? నీకు ద్వారక గురించి ఏం తెలిసింది? మనసు మళ్ళీ ఎదురు ప్రశ్న వేసింది.

నాకు ఆ క్షణంలో పుల్లయ్యని చేసుకుని గొప్ప సంతృప్తితో చూసిన చీరా, మనసు పడ్డ నగతో బతుకుతున్న ప్రియంవద పెద్దమ్మా, నాన్నగురించి ఎన్ని నేరాలు చెప్పినా, ఆయనకోసం పూజలూ వ్రతాలూ చేస్తూ, ప్రేమగా బ్రతికేస్తున్న వసుంధరా, మొగుడితో ఎన్ని తన్నులు తిన్నా, వాడితో సరసాలాడ్తూ, సినిమాకి వెళ్ళే పనిమనిషి వరాలూ అందరూ నాకన్నా గొప్ప తెలివైన వాళ్ళుగా సగం జీవితం తెరచాపలేని నావలా గడిపేసి నడి సముద్రంలో నావలా నేనూ కనిపించాం.

వసుంధర ఒక్కతే వంటగది శుభ్రం చేసుకుంటుంటే పెద్దమ్మ వెళ్ళాక లోన్లీగా ఫీల్ అవుతుందేమో అని పలకరించాలనిపించింది.

"ఏమైనా సాయం చెయ్యనా?" అడిగాను.

"మన సూపర్ మార్కెట్‌లోకానీ, అమెజాన్ ఆన్‌లైన్‌లో కానీ దొరకదుట. నీ తెలివి ఉపయోగించి కాస్త సైనేడ్ తెప్పించిపెట్టు. గుటుక్కున మింగిపోతా. నీకు మా బాధ వదిలిపోతుంది" అంది.

మొదటిసారి చాలా హర్ట్ అయ్యాను. ఇంత పెడసరంగా మాట్లాడ్డానికి నేనేమంత నేరం చేసానూ? నచ్చినవాడితో కలిసి కొంతకాలం ఒక చూరు కింద బతికి వర్కవుట్ అయితే పెళ్ళి చేసుకుంటాను అన్నందుకా? వీళ్ళు నాన్న ప్రావిడెంట్ ఫండ్, వీళ్ళ ముసలితనం కోసం దాచుకున్న కొద్దో గొప్పో సేవింగ్స్ అన్నీ ఖర్చుపెట్టి పెళ్ళి చేసాకా, నేను ఆ సోమేశ్వరరావో, లేక సుబ్బారావ్‌తోనో పడక ఓ ఏడాదిలో విడిపోతే ఎంత నష్టం? నాన్నకి మళ్ళీ అవన్నీ సంపాదించే వయసుందా? మొత్తం ఈ పెళ్ళి అనే జూదంలో ఒడ్డేటంత సాహసం ఈ పిచ్చి తల్లితండ్రులెందుకు చేస్తారు?

"నీకంత కష్టంగా వుంటే వేరే వెళ్ళి బతుకుతాలే అమ్మా" అని నా గదిలోకి వచ్చేసా.

ఫోన్ నిన్న రాత్రినుండీ చూడలేదు. చేతిలోకి తీసుకుని, మ్యూట్ తీసెయ్యగానే, మెసేజ్ వచ్చింది. ద్వారకనుండి ఒక్కసారిగా నరాల్లో నుండి రక్తం జివ్వున చిమ్మినట్లయింది ఒళ్ళంతా. చూస్తే... చిన్న మెసేజ్.

"నీ మెసేజ్‌లన్నీ నిన్ననే చూసా. సాయంత్రం వెస్టిన్‌లో కలుద్దాం. ఐ యాం ఇన్ హైదరాబాద్. సిక్స్ థర్టీ కొచ్చి కాల్ చెయ్యి....ద్వారక."

ఆ మెసేజ్‌లో ఏమీ పశ్చాత్తాపం, నాన్న గురించి చదివిన రిగ్రెట్ ఏమీ లేవు. ఐ మిస్ యూ. అనుకోని పరిస్థితులొచ్చిపడి నీ మెసేజ్‌లు చూడలేదు సారీ... లాంటి ఎక్స్‌ప్లెనేషన్ కూడా లేదు. దటీజ్ ద్వారక.

క్యాబ్ తీసుకుని అతను చెప్పిన టైంకి వెస్టిన్ హోటల్‌కి వెళ్ళాను. అంత పెద్ద హోటల్‌కి నేను నిజంగా ఫస్ట్ టైం వెళ్ళడమేమో. ఎంట్రెన్స్‌లో నా బ్యాగ్ చెకిన్‌లో వేసి అవతలవైపు తీసుకునేటప్పుడే ఆ వైభవానికి కాళ్ళు వణికాయి. రిసెప్షన్ దాటి, ఫోన్ చేసాను. ఒకటి రెండు రింగ్‌ల తర్వాత ద్వారక "హాయ్! లిఫ్ట్ ముందు లాబీలో కూర్చో వచ్చేస్తున్నా" అన్నాడు.

నేను ఆ హోటల్ అందం చూస్తూ అలాగే లాబీలో వున్న సోఫాలో కూర్చున్నా. ఎక్కువగా ఫారినర్స్ వున్నారు. పక్కన రెస్టారెంట్‌లో డయిన్ చేస్తూ.

ఒక అమ్మాయి "మే ఐ హెల్ప్ యూ?" అని అడిగింది.

అవసరం లేకపోయినా దడ వచ్చింది.

"నో థాంక్స్. వెయిటింగ్ ఫర్ ఎ ఫ్రెండ్" అన్నాను.

"ఓకే" ఆమె ప్రొఫెషనల్ చిరునవ్వుతో వెళ్ళిపోయింది.

అమ్మా నాన్నా ఇలాంటి హోటల్‌కి ఒక్కసారైనా వచ్చి వుంటారా? అని ఆలోచించాను. వసుంధర ఇలాటి హోటల్స్కి డిన్నర్‌కి వచ్చినా "వాడి మొహం అదేం సాంబారూ? అదేం పులావ్? ఛ..పేరు గొప్పా.. ఊరు దిబ్బా. ఈ స్టార్ హోటల్స్" అంటుంది.

మధ్య తరగతి మనస్తత్వం. అలా చెప్పుకుంటూనే కదా బతుకులు ఈడ్చేస్తాం లేకపోతే మాటిమాటికీ 'వెస్ట్ఇన్' హోటల్‌కి రాగలమా?

లిఫ్ట్ దిగి ద్వారక వస్తూ కనిపించాడు. ఫార్మల్స్‌లో, ఇంకా హుందాగా, ఇంకా అందంగా కనిపించాడు.

నా కాటన్ షర్ట్, జీన్స్ ప్యాంట్, లూజుగా వదిలేసిన హెయిర్ ఓసారి చూసుకున్నా.

"హాయ్!" వస్తూనే నాకు చెయ్యి ఇచ్చాడు. నేను లేచి నిలబడితే, చెంపకి చెంపతాకించి వదిలేస్తూ "డిన్నర్ చేసి రూముకి వెళ్దామా?" అడిగాడు.

"మాట్లాడాలి ముందు" అన్నాను.

"కం.." అని లిఫ్ట్ వైపు నడిచాడు. లోపలికి వెళ్ళాక తన కార్డ్ పెట్టాడు. అప్పుడే లిఫ్ట్ పైకి వెళ్ళింది. సెక్యూరిటీ వైజ్ చాలా పకడ్బందీ అన్నమాట. మన రూం నెంబర్ తెలిసినా ఎవరూ రాలేరు.

అతని వెనుక ఆ రూములోకి ప్రవేశిస్తుంటేనే కాళ్ళు వణికాయి. చాలా నీట్‌గా వుంది రూం. అతని సూట్ కేస్, పక్కమీద నైట్ డ్రెస్, టేబుల్ మీద ఓపెన్ చేసి వున్న లాప్‌టాప్, సోఫా మీద ఓ టవల్ కనిపించాయి.

అతను  మంచం మీద కూర్చుని "కూర్చో" అన్నాడు.

నేను కూర్చుని "నాలుగురోజులుగా నేనెంత బాధపడ్డానో తెలుసా? నీ నుండి రెస్పాన్స్ రాక. నువ్వు ఏమయ్యావో తెలీక" అన్నాను. దుఃఖంతో కంఠం పూడుకుపోయింది.

"రిలాక్స్...కాఫీ తాగుతావా?" అని, ఫోన్ వైపు నడిచి కాఫీ ఆర్డర్ చేసేసాడు.

"నువ్వు అస్సలు కేర్ చెయ్యలేదు కదూ నా మెసేజ్‌లూ, కాల్స్" అన్నాను.

అతను నా దగ్గరకొచ్చి, నా పక్కన కూర్చుని, నా తలమీద చెయ్యివేసి నిమిరాడు. ఆ తర్వాత లేచి దూరంగా కూర్చున్నాడు.

"మాట్లాడు" అన్నాను.

"నీది అయిపోయిందా?" నవ్వాడు.

"నాన్నకి మన విషయం చెప్పగానే హార్ట్ ఎటాక్ వచ్చింది. చచ్చి బతికారు. అంత పెద్ద విషయం నీకు ఫోన్ చేస్తే, నువ్వు కనీసం కాల్ చేసి నన్ను కన్‌సోల్ చెయ్యలేదు. రెస్పాన్స్‌బులిటీ లేదు నీకు. నిన్ను నమ్మి నన్ను కలిసి బతుకుదాం వచ్చెయ్యమన్నావ్?" అని అరిచినట్లు అన్నాను. చాలా కోపం వచ్చేస్తోంది నాకు. అతనంత కూల్‌గా మాట్లాడడం ఇంకా ఒళ్ళు మండుతోంది.

"నాకు ఇదే భయం" అన్నాడు.

"ఏది?" అడిగాను.

"ప్రేమించుకోడం, కలిసి బతకడం అంటే ఇలా మన బాధలకీ, సమస్యలకీ ఎదుటివారిని కారణభూతుల్ని చేసి బ్లేమ్ చెయ్యడమేనా? నేను నిన్ను కలిసినా, కలవకపోయినా నీకుండే సమస్యలూ, నీకుండే బాధలూ నీకుంటాయి. అవి నావల్ల వచ్చినవి కావు. నావల్ల మారేవికావు. ఒకే ఒక్క మార్పు ఏంటంటే కలిసి ఒక ఇంట్లో వుంటూ కొంత సమయం ఆనందంగా గడపడం. మనం ఒకరికి ఒకరం ఒంట్లో బాగున్నా బాగోక పోయినా తోడుగా వుండడం. నువ్వు సంపాదించకపోయినా నేను ఫైనాన్షియల్‌గా సపోర్ట్ చెయ్యడం, కావాలంటే చదివించడం, నువ్వు ఏ బిజినెస్సో స్టార్ట్ చేస్తానంటే, నా చాతనైనంత సాయం చెయ్యడం, నీకు నామీద ప్రేమ వున్నంత కాలం, బోర్ కొట్టనంతకాలం కలిసి వుండడం. ట్రస్ట్ ఇష్యూస్ లేకుండా నిజాయితీగా వుండడం. ఇదీ నా దృష్టిలో 'లివ్ ఇన్ టు గెదర్' అంటే ఇందులో మా అమ్మా మీనాన్నా పార్ట్ కానే కారు. వాళ్ళ అంగీకారం, ప్రతిస్పందనా, భావోద్వేగాలూ పార్ట్ కాకూడదు" అన్నాడు.

"వాట్?" నేను అతను చెప్పింది డైజెస్ట్ చేసుకోడానికి ప్రయత్నిస్తూ అడిగాను "మా పేరెంట్స్‌నీ మీ పేరెంట్స్‌నీ గాలికి వదిలేసి మనం మాత్రం, మనకి నచ్చినట్టు వుండాలా?"

ఇంతలో డోర్ బెల్ మోగింది. అతను వెళ్ళి డోర్ తీసాడు. బోయ్ లోపలికి వచ్చి, కాఫీ సర్వ్ చేసి "హలో మేమ్" అని నన్ను విష్ చేసాడు.

"హలో" అన్నా కానీ, ఏమిటో 'బాస్'ని చూసినట్లు, పరపురుషుడితో ఒకగదిలో ఏకాంతంగా వున్నందుకూ గిల్టీగా ఫీల్ అయ్యాను.

ద్వారక అతను వెళ్ళగానే తలుపేసి వచ్చి కూర్చున్నాడు. చాలా క్యాజువల్‌గా బహుశా మేం పుట్టిపెరిగిన పరిస్థితుల్లో వ్యత్యాసం అదే. ప్రపంచాన్ని గురించి మాకు అక్కర్లేని పట్టింపులూ.. భయాలూ.

"గాలికి వదిలెయ్యమనలేదు. డాడ్ కోసమే హైదరాబాద్ వచ్చాను. మన ప్రోబ్లమ్స్ ఎదుటి వారి మీద రుద్ది నేనింత బాధపడ్తున్నాను. చూసావా. నువ్వు మాత్రం హాయిగా వున్నావ్. నిన్న రాత్రి నేను నిద్రపోలేదు. నువ్వు హాయిగా పడుకున్నావ్. నేను ఏడిచాను. నువ్వు పాప్‌కార్న్ తింటూ సినిమా చూసావ్. ఇవీ ఎమోషనల్ డిపెన్‌డెన్సీలు. ఇవి అంటే నాకు చిన్నతనం నుండీ భయం. పెళ్ళయి ఒకళ్ళ ఫ్యామిలీలో ఒకళ్ళు బాండ్ అయి ఎమోషనల్‌గా కొత్త బాండ్స్ పెంచుకుంటే, ఖర్మ కాలి మనం పడక విడిపోతే లైఫ్‌లో ఆ విడాకులకి ఎంత ప్రొసీజర్ వుంటుందో, ఎంత సఫరింగ్ వుంటుందో నాకు చిన్నప్పుడే తెలుసు.

ఎన్ని నిద్రలేని రాత్రులో. ఏడిచే అమ్మా అమ్మని నిందించే నాన్నా. నాన్నని విలన్‌ని చేసి చూపించే అమ్మా. అనవసరంగా 'ఎద్దు పుండు కాకికి రుచి'లా గాయాల్ని కెలికి, సూటీపోటీ మాటలనే అటూ ఇటూ బంధువులూ. ఈ చట్రంలో నేను బంధింపబడాలి అనుకోవడంలేదు.

ఈ రోజుల్లో మన జెనరేషన్‌లో ఒకరంటే ఒకరికి చాలా ఇష్టమయ్యాక కలిసి బతకాలి అనుకున్నాక, ఫిజికల్ రిలేషన్ అనేది చాలా పెద్ద విషయం అనుకోలేదు. నువ్వూ అనుకున్నావని నేను అనుకోను. నువ్వు అమాయకంగా, ప్రెగ్నెన్సీ

వస్తే ఎలా? అని నాకు ఫోన్ చేసినప్పుడు, నేను అది ఈజీగా తీసుకోలేదు. నీ శరీరం నీ ఇష్టం. ఉంచుకుంటానంటే నేను పూర్తి బాధ్యత తీసుకుంటానని చెప్పా. ఐ స్టిక్ టు మై వర్డ్స్.. స్టిల్" అన్నాడు.

అంతా అర్థం అయినట్లూ అవనట్లూ వుంది. 'మెన్ ఫ్రం మార్స్..విమెన్ ఫ్రం వీనస్..' ఇలాగే వుంటుంది.

"కానీ.. అమ్మా నాన్నా ... సమాజం.. ఇవి అన్నీ నీకోసం నేను వదిలేసుకోగలిగేవి కావు నాన్న బాధలో లాజిక్ వుంది. నీమీద నాకు నమ్మకం వున్నా వాళ్ళకి వుండాలని లేదు. వాళ్ళకి నాతో జీవితం పంచుకునే నీతోబాటు మీ ఫ్యామిలీ కూడా ఇంపార్టెంట్. వాళ్ళు విడివిడిగా వున్నా ఎలా వున్నా ఎట్‌లీస్ట్ వాళ్ళ వివరాలు కావాలి. మేం మధ్య తరగతి వాళ్ళం. అలాగే బ్రతుకుతాం.

"మీ అమ్మాయి పెళ్ళి అయిందా? అత్తవారిది ఏ ఊరూ? అల్లుడేం చేస్తాడూ?" ఇవే ప్రశ్నలుంటాయి ఎక్కడికెళ్ళినా వాళ్ళకి వాటికి వాళ్ళు జవాబులు ఇవ్వగలగాలి. అంతేకానీ ఎవరితో కలిసి వుంటోందో తెలీదు. అల్లుడు అనచ్చోకూడా లేదో తెలీదు. వాళ్ళ అమ్మా నాన్నని మేం ఎప్పుడూ కలవలేదు. ఇలా జవాబు చెపితే లోకం దృష్టిలో వాళ్ళంత బాధ్యత లేని పేరెంట్స్ ఇంకొకళ్ళు వుండరు. వాళ్ళ జీవితం అంతా పిల్లలని కనీ, పెంచడం ఇదే పని. ఈ పనిలో ఫెయిల్ అయితే బ్రతకడం దండగ అని భావిస్తారు. ఇలా రూట్స్‌లో నుండి పాతుకుపోయిన భావాలని ఎలా మార్చగలం?"

ద్వారక కాఫీ అందించాడు.

"రిషీ ఇది ఇంత సీరియస్ మ్యాటరే. నాకు తెలుసు. బట్.. ఎమోషనల్‌గా నన్ను కట్టిపడేయడం ఎవరైనా సరే.. నేనిష్టపడను. ఈ డిపెండెన్సీ నేనేకాదు. నీ భర్త ప్లేస్‌లో ఎవరున్నా చెయ్యకు. అప్పుడే వాళ్ళూ నువ్వూ సుఖంగా వుంటారు. ఇది వద్దనే నేను మేరేజ్ ఇన్స్టిట్యూషన్ కి దూరంగా వుంటున్నాను. ఏ కథ చదివినా సినిమా చూసినా, ఇద్దరు ఇండివిడ్యుయల్స్ ప్రేమించుకున్నంత కాలం హేపీగా వుంటారు. నెక్స్ట్ పార్ట్ పెళ్ళి చేసుకున్నాక ప్రోబ్లెమ్స్ స్టార్ట్ అవుతాయి. ప్రేమంటే అవతలి వాడిని మన ప్రేమతో బంధించాలనుకోవడం... మన ప్రతి కష్టానికీ కారణం చేసి బ్లేమ్ చెయ్యడం కాదు. ఎట్‌లీస్ట్ నువ్వు ఇది అర్థం చేసుకుంటావ్ అనుకున్నాను. ఇలా మేం మధ్య తరగతివాళ్ళం సమాజం అంటే మాకు భయం. ఆ సమాజానికి లొంగే మా ఇష్టాలని చంపుకు బతుకుతాం అని అనే అమ్మాయిలా కనిపించలేదు. నీ బోల్డ్‌నెస్ చూసి నేను ఒక స్టెప్ ముందుకి వేసాను. నాకు తగ్గ పార్ట్‌నర్ దొరికింది అనుకున్నాను. ఇదే నువ్వు 'పరీ' పరిస్థితిలో వుండి ఇంకో అమ్మాయిని పెళ్ళి చేసుకుని ఇంటికి తీసుకొచ్చి వుంటే మీ అమ్మా నాన్నా ఏమనేవారు? నాలుగు రోజులు పోయాక అయినా ఒప్పుకునేవారు కాదా?" అన్నాడు.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS